స్కైకేబుల్ ఏర్పాటుకు సర్వే

గోల్కొండ కోటలో స్కైకేబుల్‌పై చర్చిస్తున్న అధికారులు

మెహిదీపట్నం, నవంబర్ 12: ప్రజలకు ట్రాఫిక్ సమస్యలను నివారించడానికి సెవెన్‌టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు స్కై కేబుల్ నిర్మించాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ ప్రతిపాదించడంతో మంగళవారం పురావస్తు శాఖ, పర్యాటకశాఖ, హైద్రాబాద్ యునిఫైడ్ మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హంప్‌టా)అధికారులు సంయుక్తంగా గోల్కొండలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఎండీ జీవన్ బాబు, పురావస్తు శాఖ సూపరింటెండెంట్ అర్కియాలజిస్ట్ డాక్టర్ స్మితా ఎస్ కుమార్‌ల బృందం పాల్గొన్నారు. సర్వే నిర్వహించిన అధికారులు సంబంధిత మంత్రితో సమావేశం అయి ప్రాజెక్ట్‌ను ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు.

తుల్జాభవన్‌లో అంకుట్ పూజ

అంకుట్ పూజలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ, నవంబర్ 12: ఏకగ్రతతో భగవంతున్ని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని జీవదాయ గ్రూప్ ఆధ్వర్యంలో అంకుట్ పూజ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి తుల్జాభవన్‌లో నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కన్నె రమేశ్‌యాదవ్, సూర్యప్రకాశ్‌సింగ్, కృష్ణకుమార్, అభయ్‌చౌర్య, వసంత్, ప్రకాశ్, శివకుమార్, దాల్మియా, లక్ష్మికాంత్‌సోని ఉన్నారు.

ఆర్థిక సాయం

గోల్నాక డివిజన్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు లావణ్య (45) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దూసరి లావణ్యగౌడ్ సులోచన పార్థివ దేహం వద్ద నివాళులర్పించి ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

– గోల్నాక, నవంబర్ 12

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించేందుకే సర్వే

బర్కత్‌పురలోని ఓ ఇంట్లో సర్వే చేస్తున్న అధికారులు, పరిశీలిస్తున్న డీసీ మారుతిదివాకర్

అంబర్‌పేట, నవంబర్ 12: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని అంబర్‌పేట సర్కిల్ డీసీ ఎ.మారుతీ దివాకర్ అన్నారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో జరుగుతున్న సర్వే తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతి ఇంటికీ స్టిక్కరింగ్ జరిగిందని, 10వ తేదీ నుంచి సర్వే జరుగుతున్నదని తెలిపారు. మొత్తం 604 మంది ఎన్యూమరేటర్లు విధుల్లో ఉన్నారని, 60 మంది సూపర్‌వైజర్లు, డివిజన్‌కు ఒక నోడల్ అధికారి సర్వేను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సర్కిల్ పరిధిలో 90,614 ఇండ్లు ఉన్నాయని గడిచిన మూడు రోజుల్లో 4,445 ఇండ్ల సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. ఇంటింటికీ సర్వేకు వెళ్లే సమయంలో ఎన్యూమరేటర్లతో పాటు ఇన్‌ఛార్జులను కూడా పంపిస్తున్నామన్నారు. ప్రజలతో సరిగా మాట్లాడాలని, ఎవరైనా అడిగితే తమ గుర్తింపు కార్డును వారికి చూపించాలని, అవసరమైతే ఇన్‌చార్జి నోడల్ అధికారిని కూడా తీసుకెళ్లాలని సూచించామని చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందించేందుకే ఈ సర్వే నిర్వహిస్తున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు.

స్కిల్ యూనివర్సిటీతో విద్యార్థులకు ఉపాధి

సుల్తాన్‌బజార్, నవంబర్ 12 : ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని తీసుకురావడంతో విద్యార్థులకు అనేక ఉపాధి అవకాశాలు వస్తాయని నాగాలాండ్ ఐసీఎఫ్‌ఏఐ వైస్ చాన్సలర్ డాక్టర్ వీఆర్‌కే ప్రసాద్ అన్నారు. మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో పీజీ విద్యార్థులకు ఇండక్షన్ పొగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్కిల్స్‌పై అవగాహనపై పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు పరిశోధనలు, ఐటీ సెక్టార్ మీద దృష్టి సారించాలని అన్నారు. యూనివర్సిటీలో యూజీ, పీజీ విద్యార్థులకు ఇండక్షన్ పొగ్రామ్‌లను నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే. లక్ష్మణ్‌నాయక్‌ను ఆయన అభినందించారు. కళాశాలలో పీజీ డాటా సైన్స్, యూజీ డాటా సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇండక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ విఆర్‌కే ప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే.లక్ష్మణ్‌నాయక్ శాలువా, మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. నవనీతతో పాటు కళాశాల హెడ్స్, కోఆర్డి నేటర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగాలాండ్ ఐసీఎఫ్‌ఏఐ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వీఆర్‌కే ప్రసాద్‌ను శాలువా, మెమెంటోతో సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

కలుషిత తాగునీటి సమస్యకు పరిష్కారం

అంబర్‌పేట, నవంబర్ 12 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయిమధురానగర్ కాలనీలో కొన్ని రోజులుగా మంచినీటిలో మురుగునీరు కలిసి వస్తుందని స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి మంగళవారం వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్ మాజీద్‌తో కలిసి సమస్యను పరిశీలించారు. మురుగునీరు కలువకుండా మరమ్మతులు చేయించారు. బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, శ్రీహరి, రమేశ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సాయిమధురానగర్‌లో కలుషిత తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

విశ్వకర్మ యోజనా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశ్వకర్మ యోజనా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వినోద్‌యాదవ్ తదితరులు

కాచిగూడ, నవంబర్ 12: కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనా పథకాన్ని విశ్వకర్మలు సద్వినియోగం చేసుకోవాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ కోరారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో నిర్వహించిన విశ్వకర్మ యోజన పథకం సమావేశంలో వినోద్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశ్వకర్మ యోజనా పథకానికి అర్హులైన బీసీలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఈ పథకం దుర్వినియోగం కాకుండాల బ్ధిదారులు చూసుకోవాలని ఆయన సూచించారు.

15న బాల సాహితీవేత్తలకు బహుమతులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 12 : తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 15న శుక్రవారం సారస్వత పరిషత్తు ప్రాంగణంలో గల ఆడిటోరియంలో కోడూరి శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతికోత్సవం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు కథ, వచన కవిత, పద్య కవిత, చిత్రలేఖనం అంశాలలో రచనలు పంపించిన వారికి నగదు బహుమతులు, ప్రత్యేక ప్రశంస జ్ఞాపికలతో సత్కరిస్తామన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ కార్యక్రమంలో శాంతా–వసంతాట్రస్టు వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాద రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారితో పాటు పలువురు బాల సాహితీవేత్తలు పాల్గొంటారని వెల్లడించారు. 6వ తరగతి నుంచి10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతికోత్సవంలో పాల్గొని ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వేదికపై నిర్వహించనున్న పాటలు పోటీలు, వక్తృత్వం, పుస్తక సమీక్షా రచన, ఏకపాత్రాభినయం, వ్యాసరచన అంశాలలో ప్రతిభాపాఠవాలను చాటిన వారికి బహుమతులను అందజేస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చునని చెన్నయ్య పేర్కొన్నారు.

నేడు గోపాలకృష్ణకు.. పురస్కారం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 12 : పద్మభూషన్ ఎ.ఆర్. కృష్ణ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో 13న బుధవారం సాయంత్రం 6గంటలకు ఎ.ఆర్. కృష్ణ జయంతి సందర్భంగా ఎ. ఆర్. కృష్ణ–దుగ్గిరాల పురస్కారాన్ని నటులు గుమ్మడి గోపాలకృష్ణకు ప్రదానం చేయనున్నట్లు సమన్వయకర్త వి.సతీశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ టి.డి. జనార్దన్ అధ్యక్షతన జరగనున్న ఈ సభలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి, డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆచార్య డాక్టర్ డి.ఎస్.ఎన్ మూర్తి, సీనియర్ జర్నలిస్టులు భగీరథ, మహ్మద్ రఫీ, సాహితీవేత్త బిక్కికృష్ణ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. సిరిమువ్వ కల్చరల్ ఆధ్వర్యంలో మంజునాథ రచించి, దర్శకత్వం వహించిన థింక్.. నాటికను పలువురు నటీనటులు వేదికపై ప్రదర్శిస్తారని తెలిపారు.

ఆదిత్య పరాశ్రీ స్వామిజీకి జ్ఞాన సంపూర్ణనంద పురస్కారం

అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామిజీని పురస్కారంతో సత్కరిస్తున్న వక్తలు కోలేటి దామోదర్‌గుప్తా, ఆమని

రవీంద్రభారతి, నవంబర్ 12 : తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో కార్తీక మాస వైభవం–గురుశిరోమణి అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిజీకి జ్ఞాన సంపూర్ణనంద పురస్కార, గురువందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త, సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, శ్రుతిలయ ప్రధాన కార్యదర్శి నవరస గాయని, బొక్క భీమ్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పీఠాధిపతి శ్రీ ఆదితయ పరాశ్రీ స్వామిజీకి గురువందనం, జ్ఞాన సంపూర్ణనంద పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆదిత్య పరాశ్రీ స్వామిజీ లోక కల్యాణం కోసం అంబాత్రయ క్షేత్రంలో అనేక ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ ప్రజలను సన్మార్గంలో నడిపిస్తున్నారని కొనియాడారు. సభకు ముందు మధుర గాయని సుశీలమ్మ 89వ జన్మదినం సందర్భంగా నవరస గాయని ఆమని బృందంచే సినీ సుస్వరాలు ఆలపించి వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో మహ్మద్‌రఫీ, బోగరాజు, పలువురు గాయని గాయకులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు రిజర్వేషన్లు కల్పించాలని వినతి

చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న మేరు సంఘం నాయకులు

అబిడ్స్, నవంబర్ 12 : చేతి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేరు కులస్తులకు వెనకబడిన తరగతుల స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు కల్పించాలని రాష్ట్ర మేరు సంఘం నాయకులు బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను కోరారు. మంగళవారం మాసాబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య భవన్‌లో రాష్ట్ర మేరు సంఘం నాయకులు కీర్తి రాజ్‌గోపాల్, దీకొండ నరసింగరావు, ఎస్‌బీ సంగేవార్, కిష్టారెడ్డి, పేట వెంకటేశ్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్‌లతో కూడిన బృందం నాయకులు బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిరుపేదలైన మేరు కులస్తులు అన్ని రంగాలలో ఎంతో వెనకబడి ఉన్నారన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి వారిదని, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో మేరు కులస్తులను గుర్తించి ఆదుకోవాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పనులు చేయాలి

ఆబిడ్స్, నవంబర్ 12 : ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు పనిచేయాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ ఖాద్రి అన్నారు. మంగళవారం అఫ్జల్‌గంజ్‌లో రోడ్డుపై డివైడర్ నిర్మాణం వల్ల ఇబ్బందులు కల్గుతాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్సీ అక్కడికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌గంజ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఎమ్మెల్సీ రహమత్ బేగ్‌కు డివైడర్ నిర్మాణం ప్రాధాన్యత గురించి వివరించారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడిన తర్వాత నిర్మించాలని ఆయన సూచించడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్ ఖాద్రి అన్నారు. మంగళవారం సయ్యద్‌నగర్‌కు చెందిన షాజ హాకు రూ.1.15లక్షలు, షమీమ్ ఉన్నిసాకు రూ.2లక్షల విలువగల సీఎం ఆర్ ఎఫ్ నుంచి మంజూరైన ఎల్వోసిని మల్లేపల్లి ఎంఐఎం నాయకుడుతో కలిసి ఖాద్రి అందజేశారు. – మెహిదీపట్నం

నేడు నిజాం కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

సుల్తాన్‌బజార్, నవంబర్ 12: నిజాం కళాశాల మూడవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భీమా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బాసుత్కర్ జగదీశ్వర్ రావు, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కుమార్ మొలుగరామ్, ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఎం. రాములు పాల్గొంటారని అన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నాంపల్లి నియోజకవర్గం విజయ్‌నగర్ కాలనీ డివిజన్ జేబాబాగ్‌లో మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంబించారు. ఈ పనులను ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఆదేశాలతో ఎంఐఎం ననాయకుడు షేక్‌ఖాసీం పర్యవేక్షించారు. – మెహిదీపట్నం

వికారాబాద్ కలెక్టర్‌పై దాడి అమానుషం

యుగంధర్‌గౌడ్

రవీంద్రభారతి, నవంబర్ 12: అగచర్లలో విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై దాడులు చేయడం అమానుషమని, దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. విధులు నిర్వహిస్తున్న కలెక్టర్‌పై దాడి చేయడమంటే ప్రజలకు ప్రజాస్వామ్యంపై నమ్మకం పోతుందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర కులగణను అడ్డుకోవాలని బీజేపీ నాయకులు విఫల ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిగౌడ్, సాయిబాబా, రాఘవేందర్, నగేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరమణ చౌరస్తా నుంచి మసీదు వరకు కొత్త రోడ్డు నిర్మాణం

శ్రీరమణ చౌరస్తా నుంచి నిర్మించిన కొత్త రోడ్డు

అంబర్‌పేట, నవంబర్ 12 : అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబర్ వరకు ఉన్న పావు కిలోమీటర్ దూరానికి 13 నెలలు పట్టిందని ఇటీవల నమస్తే తెలంగాణ లో వచ్చిన వార్తా కథనానికి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. ఈ రోడ్డును నిర్మించకపోవడంతో శ్రీరమణ చౌరస్తాలో అస్తవ్యస్తంగా మారిందని, రోడ్డు వేయడానికి తవ్విన చోట వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారని వార్తను ప్రచురించడం జరిగింది. కొద్ది దూరానికి ఒక సంవత్సరం ఒక నెల కాలం పట్టిందని వార్త రాయడంతో నేషనల్ హైవే అధికారులు కొత్తగా బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. శ్రీరమణ చౌరస్తా నుంచి మసీదు వరకు రోడ్డును నిర్మించారు. ఇంకా కొద్ది దూరం పనులు మిగిలి ఉన్నాయి. రెండు రోజుల్లో ఆ పనులు కూడా పూర్తికానున్నాయి. ఈ రోడ్డు పూర్తయితే ఛే నంబర్ వరకు రాకపోకలు సాగనున్నాయి. దీంతో వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి.

మత్స్య కార్మికుల సంక్షేమానికి కృషి

చేపలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, నవంబర్ 12 : మత్స్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. కర్నాటకలోని సిటీ మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ స్టాల్‌ను ఆయన సందర్శించి, చేపలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నాటకలోని చేపల పెంపకం, వినియోగంపై అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రవీంద్రభారతి, నవంబర్ 12 : జలమండలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్షుడు ముగుళ్లరాజిరెడ్డి నేతృత్వంలో యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీ భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కే రామరాజు, సీహెచ్ సురేశ్‌బాబు, ఆర్.సీత్యా, సురేశ్ తదితరులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగులకు ప్రీహెల్త్‌కార్డులు మంజూరు చేయాలని,ఖాళీ ఉన్న 3000 ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్, ఎన్.ఎమ్ ఆర్, మహిళా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. మీ సమస్యల పరిష్కారానికి సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తాన్నారు. రఘునాథ్, నరేందర్, జంగారెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్

కాచిగూడ, నవంబర్ 12: కాచిగూడ డివిజన్ అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. నింబోలిఅడ్డా కార్యలయంలో జలమండలి అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని బస్తీలలో మురికి నీరు రాకుండా జలమండలి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, బల్వీర్, భీంరాజ్, సంతోష్, బాల ప్రసాద్, లావణ్య, సారిక, తార తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని పరామర్శించిన రాజాసింగ్

గ్లోబల్ దవాఖానలో చికిత్స పొందుతున్న న్యాయవాది కల్యాణ్‌ను పరామర్శిస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసింగ్

అబిడ్స్, నవంబర్ 12 : న్యాయవాది కల్యాణ్‌పై కత్తులతో దాడిచేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసిం గ్ కోరారు. నాంపల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది కల్యాణ్ నెక్లెస్‌రోడ్‌లోని ఐమాక్స్ థియేటర్ ప్రాంతంలో వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని దుండగులు కాపుకాసి కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో కత్తి పోట్లకు గురైన కల్యాణ్‌ను లక్డీకాపూల్‌లోని గ్లోబల్ దవాఖానలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టి రాజాసింగ్ దవాఖానకు చేరుకుని కల్యాణ్‌ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని మీకు అండగా ఉంటామన్నారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ న్యాయవాది కల్యాణ్‌పై జరిగిన దాడిని పోలీసులు దర్యాప్తు వేగిర పర్చి నిందితులను తక్షణమే అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దర్యాప్తు వేగిరమయ్యేలా పోలీస్ శాఖను అదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి దాడులను న్యాయవాదులు ఖండించాలని ఎమ్మెల్యే కోరారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలి

సుల్తాన్‌బజార్, నవంబర్ 12: ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్, బేసిక్ పే వేతనం తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో సమ్మెకు దిగుతామని ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధా న కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా ప్రభుత్వాన్ని మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ 78 క్యాడర్‌లలో 17,541 మంది పనిచేస్తున్నారని అన్నారు. వారంద రికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి బేసి పే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నారని అన్నారు. 20 16లో సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ఇచ్చిన ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన 7 నెలల పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరికి సంవత్సరానికి 35 రోజుల క్యాజువల్ లీవ్స్‌ను మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులను, హెల్త్ ఇన్సూరెన్స్‌ను, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలను ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో భర్తీ చేయాలని, ప్రతి నెలా 1వ తేదీన జీతాలను చెల్లించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నవంబర్ 16 లోపు సమస్యలన్నీ పరిష్కరించాలని లేకుంటే ఉద్యోగుందరూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నేడు బతుకమ్మకుంటకు హైడ్రా కమిషనర్

అంబర్‌పేట, నవంబర్ 12 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటకు నేడు బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ వస్తున్నారు. ఒకప్పుడు మహిళలు బతుకమ్మ ఆడి బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేసేవారని మాజీ రాజ్య